క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీకే అరుణ



కోస్గి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పాలమూర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం , ప్రభుత్వ జూనియర్ కళాశాల, సంపల్లితో పాటు పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్ సమయం ముగిసేందుకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని పార్టీ నాయకులు తెలియజేశారు.

ఈవీఎం మొరాయింపు



దామరగిద్ద: మండలంలోని 53 పోలింగ్ కేంద్రాల్లో 70 శాతం పోలింగ్ జరిగినట్లు సమాచారం. మొత్తం 44,480 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 21,810 మంది పురుషులు, 22,670 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. కాన్‌కుర్తిలోని 69 పోలింగ్ కేంద్రంలో ఉదయం అరగంట ఈవీఎం మొరాయించడం మినహా ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోలేదు. మండల కేంద్రంలోని 83వ పోలింగ్ కేంద్రాన్ని యూత్ మేనేజ్డ్ పోలింగ్ కేంద్రంగా యువ పోలింగ్ సిబ్బంది నిర్వహించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత కొండప్ప ఇదే పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

భారీగా పెరిగిన ఓటింగ్

కృష్ణా: మండలంలో ఈ సారి జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎప్పుడూ లేనంతగా 70 శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలోని కున్సిలో ఉదయం 64వ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో దాని స్థానంలో అధికారులు వేరే వాటిని ఏర్పాటు చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి గుడెబల్లూర్‌లో పోలింగ్ సరళిని పరిశీలించారు.



కోస్గిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటేసేందుకు వస్తున్న వృద్ధురాలు

అడిషనల్ కలెక్టర్ పరిశీలన



మాగనూర్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

మాగనూర్: మండలంలోని బైరంపల్లిలోని బూత్ నంబర్ 54లో గంట పాటు ఈవీఎం మొరాయించింది. ఇది తప్ప మిగతా కేంద్రాల్లో ఎక్కడా ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తలేదు. మండల వ్యాప్తంగా 25 బూత్‌లకు గాను 19,319 మంది ఓటర్ల ఉండగా.. అందులో 14,668 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 75.92శాతం ఓటింగ్ నమోదయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని 64, 65, 66, 67 బూత్‌లను జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ పరిశీలించి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.



మరికల్‌లో మొదటి సారి ఓటు వేసిన యువతులు



కిష్టాపూర్‌లో ఓటు వేసేందుకు క్యూలో నిల్చొన్న గ్రామస్తులు



కోస్గి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

పోలింగ్ ప్రశాంతం

నారాయణపేట రూరల్: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పట్టణం, మండల వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఓటర్లు ఉదయం పోలింగ్ కేంద్రాలకు పెద్దఎత్తున తరలివచ్చి క్యూ లైన్‌లో నిల్చొని ఓటు వేశారు. మధ్యాహ్నం కొంత ఎండ ఉండటంతో పోలింగ్ సరళి మందగించింది. చాలా చోట్ల పోలింగ్ కేంద్రాలు ఓటర్లు లేక బోసిపోయాయి. సాయంత్రం చివరి గంటలో కొంత పోలింగ్ పుంజుకొంది. వలస ఓటర్లు చాలా వరకు రాలేదు. మొదటి సారి ఓటు హక్కు పొందిన యువత ఓటు వేసి ఆనందం వ్యక్తం చేశారు. వృద్ధులు, వికలాంగులు సైతం ఉత్సాహంగా ఓటు వేయడం కనిపించింది. సెన్సిటీవ్ ప్రాంతాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతకు కర్ణాటక పోలీసులను వినియోగించడంతో భాష తెలియక ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

• నారాయణపేట మండలంలో 28 గ్రామపంచాయతీలు, పట్టణంలోని 23 వార్డులకు కలిపి 90 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటి పరిధిలో పురుషులు 40,263 మంది, మహిళలు 42,083 మంది, ఒక ట్రాన్స్‌జెండర్‌తో కలిపి మొత్తం 82,347 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం పోలింగ్‌లో 22,902 మంది పురుషులు, 24,588 మంది మహిళలు, ఒక ట్రాన్స్‌జెండర్‌తో కలిపి 47,491 మంది ఓటు హక్కును వినియోగించుకోగా.. 57.7 శాతంగా నమోదయ్యింది. ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అప్పక్‌పల్లిలో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ సదాశివరెడ్డి, జిలాల్‌పూర్‌లో, బీజేపీ మండల అధ్యక్షుడు సాయిబన్న బైరంకొండలో, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేపూరి రాములు కోటకొండలో ఓటు వేశారు. అదేవిధంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, వైస్ చైర్మన్ హరినారాయణ్‌భట్టడ్, కాంగ్రెస్, బీఆర్ఎస్ అధ్యక్షుడు సలీం, విజయ్‌సాగర్ పట్టణంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు.



జిలాల్‌పూర్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న గ్రామస్తులు



శేరివెంకటాపూర్‌లో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి



అప్పక్‌పల్లిలో ఓటు వేసిన ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి



నారాయణపేట మండలం జాజాపూర్‌లో ఓటేసిన ట్రాన్స్‌జెండర్

ధన్వాడలో 66 శాతం..

ధన్వాడ: మండలంలో మొత్తం 66 శాతం పోలింగ్ నమోదయ్యింది. నారాయణపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పర్ణికారెడ్డి ధన్వాడ మండల కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి ధన్వాడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడే ఆశ కార్యకర్తతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకున్నారు.



ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేసేందుకు వెళ్తున్న వృద్ధురాలు



సిరా సింబల్ చూపిస్తున్న కుటుంబ సభ్యులు



హన్మన్‌పల్లిలో మొదటి ఓటు హక్కు వినియోగించుకున్న అక్కాచెల్లెలు

మరికల్‌లో..

మరికల్: మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మరికల్‌లో పోలింగ్ సరళిని పరిశీలించారు. తీలేర్‌లో డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, మరికల్‌లో జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, పెద్దచింతకుంటలో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, జిన్నారంలో ఎంపీపీ శ్రీకళ ఓటు వేశారు. ఉదయం 7 గంటల నుంచే ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.



తీలేర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



తీలేర్‌లో బారులు తీరిన ఓటర్లు

సీఎం నియోజకవర్గంలో 70.78 శాతం ఓటింగ్



కోస్గిలో ట్రైసైకిల్‌లో వచ్చి ఓటేసిన వికలాంగ ఓటరు గోపాల్

కోస్గి: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో 70.78 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన మండలాలతో కలిపి 8 మండలాల పరిధిలో మొత్తం 2,41,794 మంది ఓటర్లు ఉండగా.. 1,71,143 మంది తమ ఓటు హక్కు వినియోగించున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో 85,214 మంది పురుషులు ఉండగా.. 85,929 మంది మహిళలు ఉన్నారు. కోస్గి, మద్దూర్, గుండుమాల్, కొత్తపల్లి మండలాలు నారాయణపేట జిల్లాలో ఉండగా.. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాలు వికారాబాద్ జిల్లాలో ఉన్నాయి. అత్యధికంగా దుద్యాల మండలంలో 72.58 శాతం ఓటింగ్ నమోదు కాగా.. అత్యల్పంగా దౌల్తాబాద్, గుండుమాల్ మండలాల్లో 68.96 శాతం ఓటింగ్ నమోదైంది. కొందరికి పోలింగ్ స్లిప్‌లు అందకపోవడంతో పోలింగ్ కేంద్రాల సమాచారం లేక కొంత ఇబ్బంది పడ్డారు. సర్జఖాన్‌పేట, మీర్జాపూర్ గ్రామాల్లో చిన్నపాటి గొడవలు మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.



కోస్గిలో పోలింగ్ కేంద్ర సహాయకుడితో వీల్‌చైర్‌లో వెళ్తున్న వృద్ధురాలు



పెద్దచింతకుంటలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

ఊట్కూరులో 51 పోలింగ్ కేంద్రాలు



ఊట్కూరులో ఓటర్లతో మాట్లాడుతున్న చల్లా వంశీచందర్‌రెడ్డి

ఊట్కూరు: మండలంలోని 51 పోలింగ్ కేంద్రాల్లో 45,087 మంది ఓటర్లు ఉన్నారు. రెవెన్యూ అధికారులు ఆటోల్లో, ట్రాక్టర్లలో ఓటర్లను తరలించారు. ఊట్కూరు 37, 38 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం వేలలో గంట పాటు ఈవీఎం మొరయించాయి. మల్లేపల్లిలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య గొడవ జరగడంతో అక్కడ పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాల వారిని శాంతింపజేశారు. కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి డీకే అరుణ, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజుల ఆసిరెడ్డి ఊట్కూరులో పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

మక్తల్ నియోజకవర్గంలో



మక్తల్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దంపతులు



మంతన్‌గోడ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న జెడ్పీచైర్మన్ దంపతులు



మక్తల్‌లో మొదటి ఓటు హక్కు వినియోగించుకుంటున్న అక్కా తమ్ముడు

మక్తల్ నియోజకవర్గంలో మొత్తం 2,44,173 మంది ఓటర్లకు గాను 1,74,339 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో 1,19,809 మంది పురుషులు, 1,24,363 మంది మహిళలు ఉన్నారు. 71.62 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 65,834 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోలేదు. నియోజకవర్గంలో మక్తల్, మాగనూర్, నర్వ, మరికల్, ధన్వాడ, కృష్ణ, ఊట్కూర్, అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో పోలింగ్ ప్రశాంతగా నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ కోయ హర్ష, అడిషినల్ కలెక్టర్ మియాంక్ మిత్తల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ పుటేజీలను ఏర్పాటు చేశారు. చాలా మంది గ్రామాల్లో ఏమాత్రం అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో పోలీస్ యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు. వృద్ధులకు, వికలాంగులకు, గర్భిణులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. బీఎల్ఓలు, అంగన్‌వాడీ టీచర్లు మిగితా సిబ్బంది ఓటర్లకు సహకరించారు. మక్తల్‌లో పోలింగ్ కేంద్రాలను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, టీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర చైర్మన్ కొండయ్య పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే

మక్తల్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సోమవారం మక్తల్ పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాల బూత్‌లో 161 బూత్‌లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కుటుంబ సభ్యులు ఓటు వేశారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దంపతులు 160 నంబరు పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. మక్తల్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య 161 నంబర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు.



పేటలో ఓటువేసిన బీజేపీ రాష్ట్ర నేత నాగూరావు నామాజీ



ఊట్కూరులో ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



పగిడిమారిలో ఓటర్ స్లిప్‌లను రాసి ఇస్తున్న బీఎల్‌ఓలు



నారాయణపేటలో మాడల్ పోలింగ్ కేంద్రంలో ఫొటో దిగుతున్న ఓటర్లు

తగ్గిన పోలింగ్ శాతం

మద్దూరు: అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం 11.08 శాతం తగ్గింది. ఉమ్మడి మద్దూరు మండంలో 62 పోలింగ్ బూత్‌లలో మొత్తం 54,487 మంది ఓటర్లు ఉన్నారు. మద్దూరు మండలంలో 37,985 ఓటర్లకు గాను, 26,509 మంది వినియోగించుకున్నారు. 19,396 మంది మహిళలకు గాను 13,382 వినియోగించుకున్నారు. 18,589 మంది పురుషులు గాను 13,127 మంది వినియోగిచంకున్నారు. కొత్తపల్లి మండలంలో 18 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 16,502 మంది ఓటర్లు ఉండగా.. 11,394 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈవీఎం మొరాయించడంతో..

మద్దూరులోని 67 పోలింగ్ స్టేషన్లలో ఈవీఎం మొరాయించడంతో దాదాపు 2 గంటల పాటు పోలింగ్ నిలిచిపోయింది. తహసీల్దార్ మహేష్‌గౌడ్ కొత్త ఈవీఎంను ఏర్పాటు చేశారు. మద్దూరు మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో 83వ పోలింగ్ స్టేషన్‌లో ఉదయాన్నే ఈవీఎం మొరాయించడంతో దాని స్థానంలో నూతన ఈవీఎంను ఏర్పాటు చేశారు. అలాగే కొత్తపల్లి మండలంలోని గోకుల్‌నగర్‌లోని 101లో ఈవీఎం మొరాయించింది. మరో ఈవీఎంను ఏర్పాటు చేశారు.



మద్దూరులోని మోమినాపూర్‌లో పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో సీలు వేస్తున్న సిబ్బంది



మద్దూరు బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేయడానికి క్యూలైన్‌లో మహిళ ఓటర్లు

నర్వలో 74 శాతం

నర్వ: మండలంలో 74శాతం పోలింగ్ జరిగినట్లు తహసీల్దార్ మల్లారెడ్డి తెలిపారు. 31 పోలింగ్ బూత్‌లో సాయంత్రం 6 గంటల వరకు మొత్తం 28,080 ఓటర్లకు గాను 21,038 ఓట్లు పోలై 74.92 శాతం నమోదైనట్లు తహసీల్దార్ తెలిపారు. మండలంలో ఎలాంటి శాంతిభద్రత సమస్యలు తలెత్తకుండా ఎస్ఐ కురుమయ్య పటిష్ట బందోబస్తు నిర్వహించారు. నర్వలో కాంగ్రెస్ నాయకులు జలంధర్‌రెడ్డి, పెద్దకడ్మూర్‌లో జెడ్పీటీసీ గౌనిజ్యోతి, ఎన్ఆర్ఐ సెల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, నర్వలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు.



నర్వలో ఓటింగ్ కోసం బారులు తీరిన ఓటర్లు

ఓటింగ్‌లో పాల్గొన్న వృద్ధులు, బాలింతలు





దామరగిద్దలో వృద్ధుడిని వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న సిబ్బంది, దామరగిద్దలో ఓటు వేస్తున్న బాలింత

దామరగిద్ద: వృద్ధులు వేసవి ఎండలను లెక్కచేయకుండా వీల్‌చైర్‌లో పోలింగ్ బూత్‌లకు తరలించి ఓటు వేయించారు. వికలాంగులు, రెండు రోజుల బాలింతలు, వృద్ధులు అనారోగ్యంతో ఉన్న వారు సైతం వ్యయప్రయాసాలతో ఓటు హక్కును వినియోగించుకున్నారు.